సాక్షి ప్రకాశం

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

సచివాలయ ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. కూటమి నాయకులు, అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయి.

- 8లో..



నేరాల అడ్డుకట్టకు అవగాహనే అస్త్రం

నేరాల అడ్డుకట్టకు అవగాహనే అస్త్రమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

9న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఒంగోలులోని పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

మద్యం దుకాణాలకు గీత కులాలు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఖాజామొహిద్దీన్

ఒంగోలు సిటీ: జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల కోసం గీత కులాలకు చెందిన వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో 10 శాతం ప్రకారం 17 దుకాణాలను గీత కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇందులో గత నెల 24న జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీశారని, లాటరీలో వచ్చిన ఉపకులాల వారు మాత్రమే ఆయా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తుతో పాటు సాధారణ రుసుములో 50 శాతం చెల్లించాలని చెప్పారు. గడిచిన 8 నెలల కాలాన్ని మినహాయించి లైసెన్స్ ఫీజు నిర్ణయించినట్లు తెలిపారు. ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయిస్తారని, ఏ జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఉపాధిలో కక్కుర్తి..!

గ్రామీణ ప్రాంత పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులపై అధికార కూటమి నాయకులు కన్నేశారు. దీనికి అధికారులు సైతం పచ్చ జెండా ఊపేశారు. జిల్లాలో రూ.170 కోట్ల మెటీరియల్ నిధులు స్వాహా చేసేందుకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యూహం ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చేశారు. చేసిన పనుల్లో మళ్లీ పనులు చేస్తున్నట్టు చూపించి నిధులు బొక్కేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఫీడర్ ఛానల్‌లో జేసీబీతో పనులు చేసినట్లు ఉన్న దృశ్యం



ఛానల్ వద్ద గతంలో పనిచేసినట్లు ఉన్న శిలాఫలకం

- రూ.170 కోట్ల మెటీరియల్ నిధులు మింగేందుకు యత్నం
- కూటమి నేతల గుప్పెట్లో ఫీల్డ్ అసిస్టెంట్లు
- యంత్రాలతో మట్టి పనులు
- చేసిన పనులనే మళ్లీ చేస్తూ నిధులు స్వాహా
- జోరుగా పొలం పనులు.. ఉపాధికి కూలీల కరువు
- ఇళ్లల్లో ఖాళీగా వృద్ధులతో ఫొటోలు తీసి మమ అనిపిస్తున్న వైనం

సింగరాయకొండ: జిల్లాలోని అన్ని మండలాల్లో సుమారు 4.37 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 3.81 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. ఈ ప్రకారం జిల్లాలో 8.10 మంది ఉపాధి హామీ పథకం కూలీలు ఉండగా వారిలో 6.77 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారని ఆ శాఖ ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం తెలుస్తోంది. ఈ పథకంలో ఎక్కువ భాగం మట్టి పనిచేస్తేనే రేషియో ప్రకారం రోడ్లు, డ్రైనేజీల తదితర అభివృద్ధి పనులకు మెటీరియల్ నిధులు మంజూరవుతాయి. నిబంధనల ప్రకారం పనులు జరిగితే రూ.170 కోట్ల నిధులు వస్తాయి. దీంతో జిల్లా అధికారులు మట్టి పనులు చేయించాలంటూ గ్రామ స్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఫలితంగా మండల, గ్రామ స్థాయి అధికారులు పని ఒత్తిడితో నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో టీడీపీ నాయకులు జోక్యం చేసుకుని యంత్రాలతో చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పాత వారితో రాజీనామాలు..

జిల్లాలో 729 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా వారిలో 550 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి వరకు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఒత్తిడి తెచ్చి రాజీనామాలు చేయించారు. అధికారులు సైతం సహకారం అందించడంతో తమకు నచ్చిన వారిని నియమించుకున్నారు. ఇప్పటి వరకూ 500 మంది వరకు కొత్తవారిని నియమించారు. మిగిలిన ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు కారణంగా నిలిచిపోయాయి. ఇంకా 179 మంది పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయని ఆయా శాఖ అధికారులే చెబుతున్నారు. కొత్తగా నియమించిన వారికి అరకొరగా శిక్షణ ఇచ్చారు. పనిచేసే సమయంలో వారు ఏం చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు కూలీలు పనికి తీసుకుని రావాలని ఒత్తిడి చేస్తుండడంతో "ఏదో ఫీల్డ్ అసిస్టెంట్‌గా వస్తే డబ్బులు బాగా వస్తాయని వచ్చామని. ఈ విధంగా రోజుకు ఒకరిద్దరు మాత్రమే వస్తే మాకు డబ్బులు రావటం సంగతి ఏమో కానీ ఒత్తిడి పెంచితే రాజీనామానే శరణ్యమని బెదిరిస్తున్నారని" మండల స్థాయి అధికారులు వాపోతున్నారు. మొత్తానికి ఉపాధి హామీ పథకం జిల్లా అధికారులు, నాయకుల అత్యాశ కారణంగా అభాసుపాలయ్యే అవకాశం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చేసిన పనినే మళ్లీ...

ఉపాధి నిధులను స్వాహా చేసేందుకు అధికార పార్టీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులనే మళ్లీ చేయిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు మితిమీరిన జోక్యంతో పనులు పక్కదారి పడుతున్నాయి. ఉదాహరణకు సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్నకనుమళ్ల ప్రాంతంలోని ఫీడర్ ఛానల్‌ను డి.కోటయ్య పొలం నుంచి కనుమళ్ల రోడ్ వరకు రూ.3.66 లక్షలతో 2022వ సంవత్సరం మే నెలలో అభివృద్ధి చేశారు. ఇప్పుడు తిరిగి అదే ఫీడర్ ఛానల్‌ను సింగరాయకొండ, కనుమళ్ల పంచాయతీకి చెందిన కూలీలతో అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. వాస్తవానికి ఈ ఫీడర్ ఛానల్‌ను రాత్రి వేళ జేసీబీతో పనిచేయించి తెల్లవారి కూలీలతో పనిచేయిస్తున్నట్లు ఉందని అక్కడి పరిస్థితిని చూస్తే అలాగే ఉందని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.



కనుమళ్ల పంచాయతీలోని ఫీడర్ ఛానల్ పనిచేయటానికి వచ్చిన వృద్ధులు, మహిళా కూలీలు

జోరుగా పొలం పనులు

జిల్లాలో పొలం పనులు జోరుగా సాగుతున్నాయి. పొగాకు, వరి, కంది, శనగ పంటల కోతలు, నూర్పిడులు, పురుగుమందులు చల్లుకోవటం, కలుపు పీకడం వంటి పనులతో పాటు మామిడి, సపోట, జామ వంటి తోటల్లో పనులు ఒత్తిడి అధికంగా ఉంది. ఈ ప్రకారం ఒకరోజు కూలీ రూ.500 నుంచి రూ.1000 వరకు ఉందని, దీంతో ఉపాధి పనులకు ఎలా వస్తామని కూలీలు చెబుతున్నారని గ్రామస్థాయి అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక వీరు పనిచేయగానే ఏరోజు కారోజు కూలీ డబ్బులు వస్తాయన్నారు. అదే ఉపాధి పనికి వస్తే చేసిన పనిని బట్టి సుమారు రూ.150 నుంచి రూ.300 మాత్రమే వస్తాయని కూలీలు వివరించారు. జిల్లాలో ఉపాధి పని కింద యాక్టివ్‌గా పనిచేసే కూలీలు సుమారు 6.77 లక్షల మంది ఉండగా మూడు రోజులుగా కేవలం రోజుకు 3 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా అధికారుల పని ఒత్తిడి అధికంగా ఉండడంతో బయట కూలి పనికి వెళ్లకుండా ఇంట్లో ఉంటున్న ముసలి వారిని బతిమిలాడి తీసుకుని వచ్చి వారిని కూర్చోబెట్టి ఫొటో తీసుకుని పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



వెండిరథంపై స్వామివారు



గడియారస్తంభం సెంటర్‌లో నగరోత్సవానికి వచ్చిన భక్తజన సందోహం

కదిలొచ్చిన దేవదేవుడు

- సప్త వాహనాలపై మాడవీధుల్లో దర్శనమిచ్చిన చెన్నకేశవుడు
- ఘనంగా రథసప్తమి వేడుకలు



స్వామి వారి ఉత్సవమూర్తులు



స్వామివారి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం మార్కాపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారు ఆలయం చుట్టూతా ఉన్న నాలుగు మాడవీధుల్లో సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల తరహాలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరగటంతో వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనం, శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, చంద్ర వాహనాలపై చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామి వారికి చక్రస్నానాన్ని అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగాచార్యులు, వేణుగోపాలాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి తిరుమల తరహాలో స్వామి వారికి వెండితో తయారు చేసిన రథంపై చెన్నకేశవ స్వామివారిని ఉభయ దేవేరులతో కలిసి ప్రతిష్ఠించి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ఆలయ ఈఓ జీ.శ్రీనివాస రెడ్డి, ఉత్సవ సేవా సంఘం అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, సోదరుడు రామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, మాజీ ధర్మకర్తలు, ఉత్సవ సేవా సంఘం సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. భద్రత ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ వేషాలతో నృత్యాలు అలరించాయి. ప్రత్యేకంగా తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలు, వివిధ రకాల నృత్యాలతో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని, ఆయన ఆదేశాలను మనమందరం కలిసి పాటించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన త్రిపురాంతకం మండల కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం అధికారంలో లేమని అధైర్య పడాల్సిన అవసరంలేదని, ప్రజల పక్షాన నిలబడి పోరాడే శక్తి అందరికీ ఉందని అన్నారు. త్వరలో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని అవి తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుందామన్నారు. నూతన కమిటీల నియామకాలు కార్యకర్తల నిర్ణయాలతోనే జరుగుతాయని చెప్పారు. ఏకపక్షంగా నాయకుడి ఎంపిక ఉండదని, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపట్టే సత్తా ఉన్న వారినే ఆయా మండలాలకు నాయకత్వం వహించే అర్హత కల్పిస్తామని అన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, ఆయా ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో చర్చించి ఆమోదయోగ్యమైన వ్యక్తిని మండలాధ్యక్షునిగా నియమిస్తామని తెలిపారు. మండలానికి నాయకత్వం వహించేందుకు ఎటువంటి అర్హత ఉందో ముందుగా సమావేశంలో చెప్పాలని, ఆ తరువాత పోటీపడుతున్న నాయకుల గురించి విడివిడిగా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. గ్రామాల్లో ఉన్న వ్యక్తిగత వర్గవిభేదాలు విడనాడి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ఇష్టపడి పార్టీ కోసం కష్టపడేవారే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. పార్టీ కార్యకర్తలతోపాటు ప్రజల కోసం పోరాడేందుకు ఎంతదూరం అయినా వెళ్తానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోవడంలేదని, కూటమి నాయకులకు ఇచ్చిన సమయం కూడా దాటిపోయిందన్నారు. ఈ పథకాలు అమలు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఉద్యమాలు చేపట్టే సమయం ఆసన్నమైందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, రేషన్ మాఫియాను అరికట్టడం, మద్యం బెల్ట్ షాపుల నుంచి పల్లెలను రక్షించేందుకు కార్యకర్తలు ముందుకు రావాలని, వారిని ఉద్యమ బాటలో నడిపించేందుకు నాయకులు తమ సమయాన్ని కేటాయించాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు మన నాయకుడు జగనన్న ఇచ్చే ప్రతిపిలుపునకు నాయకులు స్పందించాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సింగారెడ్డి పోలిరెడ్డి, మాజీ ఎంపీపీలు కోట్ల సుబ్బారెడ్డి, ఆళ్ల ఆంజనేయ రెడ్డి, జెడ్పీటీసీ జాన్‌పాల్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శేషం రంగబాబు, సర్పంచ్‌లు పాన్నం వెంకటలక్ష్మి, ఓబులరెడ్డి తిరుమలయ్య, మురారి గాలయ్య యాదవ్, గుడిమెట్ల రంగయ్య, పల్లె సరళ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

- మానసిక ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, నిరంతరం స్క్రీనింగ్ చేయించుకోవడంతో పాటు క్యాన్సర్ అంటే భయపడకుండా ధైర్యంగా ఉంటే జయించవచ్చని ఎంతోమంది నిరూపించారని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ నుంచి ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి కొంతమేరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7,64,400 గృహాలకు 1,88,854 గృహాలను సిబ్బంది సందర్శించి 5,32,212 మంది ప్రజలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. 3667 మందిని క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలతో పాటు ఎన్‌సీడీ 3.0 భాగంగా సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు ఇంటి వద్దనే చేస్తారన్నారు. అనంతరం చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎన్‌సీడీ నోడల్ అధికారి భగీరథి, డాక్టర్‌లు పద్మజ, అనిల్, హకీమ్, ఇతర అధికారులు డీ శ్రీనివాసులు, విక్టర్‌బాబు, ఆశా కార్యకర్తలు, నల్లూరి నర్సింగ్ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో షాపుల సీజ్

- కూరగాయల మార్కెట్‌లో కొనసాగుతున్న వేధింపులు
- వడ్డీ లేకుండా చేయాలని వేడుకున్నా కనికరం లేకుండా చేస్తున్న అధికారులు
- మార్కెట్‌లో దాదాపు 10కి పైగా షాపులకు సీళ్లు వేసిన అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు కూరగాయల మార్కెట్లో అధికారుల వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. కరోనా సమయం నుంచి అద్దె బకాయిలపై వడ్డీ మాఫీ చేయమని వ్యాపారులు ప్రాధేయపడుతున్నా వారం రోజులుగా మార్కెట్‌లో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు దాడుల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా మంగళవారం పోలీసులతో వచ్చిన అధికారులు హోల్‌సేల్ మార్కెట్ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలు ఉన్న షాపులకు సీళ్లు వేసేందుకు మూకుమ్మడిగా సిద్ధమయ్యారు. ఉదయాన్నే మార్కెట్‌లోకి ప్రవేశించిన అధికారులు, పోలీసులు కొంతసేపు హడావుడి సృష్టించారు. వడ్డీ మాఫీ చేస్తే బకాయిలు మొత్తం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నా కనీసం కనికరం లేకుండా దాదాపు మార్కెట్‌లోని పది షాపులకు పైగా సీళ్లు వేశారు. మొదటగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల షాపుల వద్దకు వెళ్లిన అధికారులు నానా హంగామా చేశారు. దాదాపు పది షాపులకు పైగా సీళ్లు వేశారు. మొదట పురణి ప్రభావతి షాపు వద్దకు వెళ్లి సీలు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. షాపు నిండా కూరగాయలు ఉండటంతో సీజ్ చేస్తే లోపల ఉన్న కూరగాయలు వృథా అవుతాయని, దాదాపు రూ.లక్షల్లో నష్టపోతామని భావించిన షాపు యజమానురాలు అప్పటికప్పుడు బ్యాంకు చెక్కులు ఇచ్చి గండం కట్టెక్కేందుకు నిర్ణయించుకున్నారు. గత్యంతరం లేని పరిస్థితిని ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు వ్యాపారుల్లో కల్పిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపునకు ఈ విధంగా అవకాశం దొరికిందిలే అనుకున్నారో ఏమో మరి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.



షాపును సీజ్ చేస్తున్న అధికారులు

సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

ఉన్న గ్రామంలోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలనే తపనతో గ్రామ స్వరాజ్య సాధన దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో అన్ని సేవలు సకాలంలో అందేవి. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండానే ప్రజలకు సేవలు అందడంతో వ్యయ ప్రయాసలు **తప్పేవి.** నేడు కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.



- వంద రోజుల పాలన స్టిక్కర్లు అంటించిన ఉద్యోగులు
- ఇప్పటికే ఒకరికి 150 నుంచి 200 కుటుంబాల పర్యవేక్షణ
- మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడ్ బాధ్యత కూడా వారిదే
- వలంటీర్లు చేసిన పనులన్నీ సచివాలయ ఉద్యోగులకే
- పెరిగిన పనిభారం.. భవిష్యత్‌పై నో ధీమా
- ఉద్యోగుల స్థాయి దిగజార్చేందుకు కుట్ర

బేస్తవారిపేట: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా దేశ చరిత్రలోనే ఎక్కడా ఎన్నడూ లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు, పరిపాలనను ప్రజల వద్దకే తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సర్కార్ భ్రష్టు పట్టిస్తోంది. కుక్కను చంపాలంటే దానిపై పిచ్చిదనే ముద్ర వేయాలన్న సామెతను నిజం చేసేలా.. సచివాలయ వ్యవస్థకే అపవాదులు అంటగడుతూ ఉద్యోగులు ఖాళీగా ఉన్నారంటూ ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తోంది.

సంబంధం లేని విధుల అప్పగింత

జాబ్ చార్ట్‌తో సంబంధం లేని విధులు అప్పగిస్తూ హీనంగా చూస్తున్నారని సచివాలయ ఉద్యోగులు లోలోన కుమిలిపోతున్నారు. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మథనపడుతున్నారు. రోజువారీ పనితో పాటు సర్వేలు, సమాచార సేకరణ పేరుతో ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడి కారణంగా సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గడిచిన కొద్దిరోజులుగా ఎంఎస్‌ఎంఈ సర్వే, పీ4 సర్వే, జియో ట్యాగింగ్ వంటి సర్వేల పేరుతో బండ చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒంగోలులో సమగ్ర కుటుంబ సర్వే చేయించారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించే పని అప్పగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. జిల్లాలో 12,442 మంది వలంటీర్లతో కలిసి 5 వేల మంది సచివాలయ ఉద్యోగులు చేస్తున్న పనులను కూటమి ప్రభుత్వంలో కేవలం ఉద్యోగులతో మాత్రమే చేయిస్తుండటంపై వారిలో అసంతృప్తి జ్వాల రగులుతోంది.

పింఛన్ల పంపిణీతో ఒత్తిడి

పులిని చూసి నక్క వాతలు పెట్టుకుందన్న చందంగా ఉంది కూటమి ప్రభుత్వ పరిస్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే వలంటీర్లతో ఠంఛన్‌గా పింఛన్ అందించారు. నేడు సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడి పెట్టి పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. తెల్లవారు జామునే మహిళా ఉద్యోగులు లక్షల నగదు తీసుకుని పంపిణీ కోసం వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. పట్టణాలు, నగర ప్రాంతాల్లో అక్కడక్కడా విసిరేసినట్లు ఉండే గృహాల్లోని లబ్ధిదారుల వద్దకు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గతంలో వలంటీర్లకు 50 నుంచి 60 కుటుంబాలు మాత్రమే ఉండగా మూడు క్లస్టర్లు కలిపి అంటే సుమారు 150 నుంచి 200 కుటుంబాల బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించారు.

జాబ్‌చార్ట్ లేదు..ప్రమోషన్ చానల్ లేదు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డిపార్టుమెంట్, సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయలేదు. ప్రమోషన్ చానల్ ఏర్పాటు లేదు. సరైన జాబ్‌చార్ట్, పని వేళలు లేవు, సెలవులు అమలు లేవు, పబ్లిక్ హాలిడేస్, హెల్త్‌కార్డు, ఇన్సూరెన్స్ బాండ్స్ లేవు. ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వకుండా ఒక మల్టీ పర్పస్ ఉద్యోగిగా వాడుకునేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మంది ఉద్యోగులు ఉండగా వ్యవసాయశాఖలో ఉన్న కేవలం 250 మందికి మాత్రమే పదోన్నతులు వచ్చాయి. అందరూ గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్, బీటెక్‌లు చదివి ఉద్యోగంలోకి వచ్చినవారే. వారందరినీ వలంటీర్ల స్థాయికి దిగజార్చే ప్రక్రియను ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తుందనే భావన ఏర్పడుతోంది.

సచివాలయ సిబ్బందిపై దాడులు

- మార్కాపురంలో శానిటరీ సెక్రటరీని మున్సిపల్ కమిషనర్ అసభ్యంగా దూషించాడు. దీనిపై సచివాలయ ఉద్యోగులు ధర్నా చేశారు.
- ఒంగోలులో ఓ సభలో టీడీపీ నాయకుడు సచివాలయ ఉద్యోగులను తరిమితరిమి కొట్టండని బహిరంగానే మాట్లాడాడు. ఈ విషయంపై ఇప్పటికి ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.
- కంభం మండలం చిన్నకంభంలో సచివాలయ చుట్టూ ఉన్న ఫెన్సింగ్ తొలగించి, సెక్రటరీపై దూసుకెళ్లి అసభ్యకరంగా టీడీపీ నేతలు మాట్లాడారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు.

రాజపూజ్యం సున్నా..అవమానం అధికం

కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించడం, కరపత్రాలు పంచమనడంపై సచివాలయ ఉద్యోగులు రగిలిపోతున్నారు. ఇప్పటికే కొందరు ఉద్యోగులు బహిరంగంగానే నిరసన తెలియజేస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షంగా ఉన్న ఇప్పటి ప్రభుత్వం వలంటీర్లతో స్టిక్కర్లు అంటించడాన్ని కోర్టులో సవాల్ చేసిందని, మరి ఇప్పుడు వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోగా ఉద్యోగులనే స్టిక్కర్లు అంటించే బాధ్యతలు ఎలా అప్పజెబుతున్నారని ప్రశ్నిస్తున్నారు. తొలుత ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వమన్నారు. ఆ తర్వాత పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలు తీయమన్నారు. ఇప్పుడేమో స్టిక్కర్లు అంటించి కరపత్రాలు పంచమంటున్నారు. వర్కింగ్ అవర్స్‌లో లైవ్ లోకేషన్ ఆన్‌లో ఉంచుకోవడంతో సెక్రటరీ పూర్తి ట్రాకింగ్ ప్రైవసీ అంతా ప్రభుత్వం చేతిలో ఉంటుంది. మిగిలిన శాఖల వారికి లేని దృష్టి సచివాలయ శాఖ మీదే ఎందుకు. ఎందుకింత లోతుగా ఒత్తిడి తీసుకొస్తున్నారో పాలకులకే ఎరుక. ఈ మధ్య తీవ్ర ఒత్తిడికి లోనై కొంత మంది సెక్రటరీలు అశువులు బాసిన సంఘటనలు కూడా ఉన్నాయి.

వైఎస్ జగన్‌ను కలిసిన దద్దాల, టీజేఆర్





మాజీ సీఎం వైఎస్ జగన్‌తో దద్దాల, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జగనన్న నియోజకవర్గ పార్టీ, రాజకీయ పరిస్థితులు అడిగి తెలుసుకున్నట్లు దద్దాల తెలిపారు. దద్దాల నారాయణ వెంట జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పులి వెంకటేశ్వరరెడ్డి, సైకం స్వర్ణ, ఏడుకొండలురెడ్డి, మడతల వెంకటేశ్వరరెడ్డి, శేషిరెడ్డి, యర్రంరెడ్డి ఆంజనేయరెడ్డి, కొండారెడ్డి, అభి ఉన్నారు.

ఒంగోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసుస్టేషన్ తనిఖీకి వచ్చిన ఎస్పీని ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు పరిస్థితుల గురించి ఆయన చర్చించారు. పక్షపాతం లేకుండా కేసులు దర్యాప్తు జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఎమ్మెల్యే తాటిపర్తి కోరారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాస్, డి.సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, షేక్ వలి, పి.రామాంజనేయరెడ్డి, టి.ఆవులయ్య ఉన్నారు.

తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశాలు

- ప్రజాసమస్యలు చర్చించేందుకు జీరో అవర్ కేటాయించని కౌన్సిల్
- కూటమి నేతల అనుకూల అజెండాల ఆమోదమే ధ్యేయం
- సాధారణ సమావేశమని అత్యవసరంగా సభ్యులకు అజెండాల బట్వాడా
- అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్న అంశంపై సభ్యుల్లో ఆగ్రహం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా కలుగజేసుకోవాలని డిమాండ్
- నేడు ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలు చర్చించేందుకు ఆమడ దూరంలో ఉన్నట్లుందన్న చర్చ నగరంలో జోరుగా సాగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కౌన్సిల్ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మూడున్నర లక్షల జనాభా ఉన్న నగరంలోని ప్రజా సమస్యలు కోకొల్లలు. అయినా సమస్యలపై దృష్టి పెట్టని అధికార పార్టీ సభ్యులు, పాలకుల స్వప్రయోజనాలే ప్రధాన అంశంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. వైఎస్సార్ సీపీ జెండాపై మేయర్‌గా ఎన్నికైన గంగాడ సుజాత పార్టీ ఫిరాయించి ఆదాయమే పరమావధిగా అధికార టీడీపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఆమెతో పాటు మరికొందరు కార్పొరేటర్లను వెంటేసుకొని మరీ వెళ్లారు. అప్పటి నుంచి నగరంలో అభివృద్ధి పనుల పేరుతో జరుగుతున్న వర్కుల్లో పర్సెంటేజీల వసూలు చేసుకుంటున్నారు. ప్రధానంగా కౌన్సిల్ సమావేశాల్లో జీరో అవర్‌ను ప్రవేశపెట్టి సభ్యులకు ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం కల్పించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కౌన్సిల్ సమావేశాల్లో అలాంటి సందర్భాలు కనుచూపుమేరలో కనబడలేదు. అజెండాలోని అంశాలపై హడావుడిగా చర్చించి జీరో అవర్ పేరుతో ఆయా అంశాలను ఆమోదింప చేసుకోవడంతోనే జీరో అవర్‌ను ముగిస్తున్నారు.

సమస్యలు చర్చించేందుకు అవకాశం కల్పించాలి

సాధారణ సమావేశంలో ప్రధానంగా కమ్మపాలెం–దశరాజుపల్లె రోడ్డులోని కబరస్థాన్ అంశంపై లోతుగా చర్చించాలని ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సభ్యులు పట్టుబట్టనున్నారు. అధికార టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కబరస్థాన్ విషయంలో ముస్లింలకు అన్యాయం చేస్తున్నారన్న అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. కూరగాయల మార్కెట్ ప్రాంగణం పక్కనే ఉన్న షాదీఖానా విషయంలో కూడా సభ్యులు లోతుగా చర్చించాలని పట్టుబడుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉంచాల్సిన షాదీఖానాను భారీ అద్దె వసూళ్ల దిశగా నగర పాలక సంస్థ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా అంశాలపై సభ్యులకు లోతుగా చర్చించే అవకాశం కల్పించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అత్యవసరంగా అజెండాల బట్వాడా

నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం అని చెప్పి సభ్యులకు అజెండాలను అత్యవసరంగా బట్వాడా చేయడం అధికారులపై విమర్శలు రేకెత్తుతున్నాయి. కౌన్సిల్ సమావేశమని అజెండాను సిద్ధం చేసిన అధికారులు జనవరి 27వ తేదీన మేయర్ గంగాడ సుజాతతో సంతకాలు చేయించారు. ఆ వెంటనే సభ్యులకు అజెండా కాపీలను పంపిణీ చేయాల్సి ఉంది. ఫిబ్రవరి ఒకటో తేదీన సభ్యులకు అజెండా కాపీలను బట్వాడా చేశారు. ఇందులో మతలబు దాగి ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం సభ్యులకు అజెండా కాపీలు అందజేసిన మరుసటి రోజు నుంచి వారం రోజుల తర్వాత కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలన్న నిబంధనను నగర పాలక సంస్థ అధికారులు తంగలో తొక్కారు. ఒకటో తేదీన అజెండా కాపీలు సభ్యులకు అందజేసిన అధికారులు కౌన్సిల్ సమావేశాన్ని ఫిబ్రవరి 7వ తేదీ తర్వాత నిర్వహించాల్సి ఉంది. కానీ ఐదు రోజులకే కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు ఉన్న మతలబు ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. సీడీఎంఏ నిబంధనలు పాటించకుండా నగర పాలక సంస్థ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టి సారించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం మేయర్ అధ్యక్షతన నిర్వహించనున్నారు.

మహిళా సర్పంచ్‌ను దూషించిన టీడీపీ నాయకులు

సీఎస్‌పురం (పామూరు): ఇద్దరి మధ్య జరుగుతున్న గొడవను ఆపి వారిని అడ్డుతీయబోయిన మహిళా సర్పంచ్‌ను టీడీపీ నాయకులు దూషించి అవమానించారు. ఈ సంఘటన కోవిలంపాడులో మంగళవారం జరిగింది. సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ కథనం ప్రకారం.. కోవిలంపాడులో షేక్ ఖాదర్‌వలి, షేక్ ఇమామ్ హుస్సేన్‌లు ఇటీవల ఇంటి పనులు ప్రారంభించారు. షేక్ రజ్జబ్ బాషా, షేక్ ఖలీల్, షేక్ నాయబ్ రసూల్ వారిని ఇబ్బందులు పెడుతున్నారు. ఆ పట్టా భూములను మంగళవారం రెవెన్యూ సిబ్బంది పరిశీలిస్తుండగా షేక్ నాయబ్ రసూల్‌కు షేక్ ఖాదర్‌వలిల మధ్య వివాదం జరిగింది. ఉదయం సుమారు 10.45 గంటల సమయంలో షేక్ నాయబ్ రసూల్, షేక్ రజ్జబ్ బాషా, షేక్ ఖలీల్ స్థలం మీకు ఎక్కడిదిరా అంటూ షేక్ ఖాదర్‌వలిపై దాడి చేస్తున్నారు. సర్పంచ్ ఖాదర్‌బీ ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దీనికి ఖలీల్ అనే వ్యక్తి తనతో గొడవకు వచ్చి దూషిస్తూ అవమాన పరిచాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేస్తున్నారు.

ఇంటికి కన్నం

- పెద్దదోర్నాలలో దొంగల చేతివాటం
- విలువైన బంగారం మాయం



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్యామణి కుమార్ వీధిలో నివాసం ఉంటున్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. విలువైన బంగారు ఆభరణాలతో పాటు 5 వేల రూపాయల నగదు మాయమైనట్లు బాధితుడు పాల్తి రాజేష్‌నాయక్ వాపోయాడు. దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించిన నాయక్ మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం కోసం జిల్లా కేంద్రంలోని క్లూస్ టీంను రంగంలోకి దించారు. దొంగతనానికి సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. ఇందిరానగర్‌లోని శ్యామణి కుమార్ వీధిలో ప్రభుత్వ వైద్యశాలలో మేల్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ నాయక్ కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో కుమారుడి ఆరోగ్యం బాగోలేక పోవడంతో అతని భార్య వారం రోజుల క్రితం గుంటూరు వెళ్లింది. దీంతో పాటు నైట్ డ్యూటీ ఉండటంతో రాజేష్ నాయక్ కూడా మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్సై మహేష్ సమాచారంతో రంగంలోకి దిగిన క్లూస్ టీం చోరీ జరిగిన నివాస గృహంతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. దొంగతనానికి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్ శివనాగసాయి దత్తాశ్రమం పక్కన కొండపై గుప్త నిధుల కోసం 15 అడుగుల లోతు తవ్విన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..కొండపై గోపిశెట్టి వెంకటశివప్రసాద్ అనే వ్యక్తి వారాహి అమ్మవారి చిన్న గుడిని నిర్మించి అక్కడకు రోజూ వెళ్లి పూజలు, ధ్యానం చేస్తుంటాడు. శివప్రసాద్ స్నేహితుడు యరమల నారాయణరెడ్డి అనే వ్యక్తి రోజూ అక్కడకు వచ్చి కూర్చుంటాడు. అదే కొండపై ఆంజనేయస్వామి గుడి కూడా ఉంది. ఈ గుడిలో పూజారిగా పసుపులేటి వెంకటేశ్వర్లు పని చేస్తున్నాడు. శివప్రసాద్‌కు వారాహి అమ్మవారు కలలో కనిపించి నా బంగారు విగ్రహం కొండ కింద ఉంది.. ఆ విగ్రహాన్ని బయటకు తీసి పూజలు చేయమని చెప్పినట్లు పసుపులేటి వెంకటేశ్వర్లు.. యరమల నారాయణరెడ్డికి చెప్పి పది రోజుల నుంచి దర్శి పట్టణానికి చెందిన షేక్ ఖాశీం, షేక్ లాలూ అనే ఇద్దరు కూలీల సాయంతో సుమారు 15 అడుగుల వరకు కొండపై గుంత తవ్వారు. సీఐ రామారావు, ఎస్సై మురళిలు కొండ ప్రాంతంలో డ్రోన్ కెమెరా ఎగుర వేయగా కింద నుంచి 80 అడుగుల ఎత్తులో కొండపై తవ్వుతున్నట్లు గుర్తించారు. పోలీసులు వెళ్లడంతో పారిపోయేందుకు ఐదుగురూ ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని అదుపులోకి తీసుకుని కటకటాల వెనక్కి నెట్టారు. ఎస్సై మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్‌ఐలు రాంబాబు, శ్రీనివాసరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్ పాల్గొన్నారు.

నేరాల అడ్డుకట్టకు అవగాహనే అసలైన అస్త్రం

- కేసుల్లో ఎటువంటి జాప్యం పనికి రాదు
- బాధితులకు అండగా ఉండటం పోలీసుల విధి
- రోడ్డు భద్రత నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి
- పోలీసు అధికారులను ఆదేశించిన ఎస్పీ దామోదర్



పెద్దదోర్నాల పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

పెద్దదోర్నాల: సైబర్ నేరాల అడ్డుకట్టకు అవగాహనే అసలైన అస్త్రమని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. పోలీసుస్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పెద్దదోర్నాల పోలీసుస్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆవరణలోని గదులను, పాత పోలీస్ క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. ప్రజలు చేసే ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం పనికి రాదని, వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాల ఫైళ్లను, జనరల్ డైరీలను ఆయన పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ నేర నివారణ, వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్‌ల్లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు చేసి తక్షణమే ఫిర్యాదుదారులకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. మహిళా భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తమంగా ఉండాలని మహిళలు, చిన్నారులపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగ తనాలు జరగకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధులపై ఆరా తీశారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేసి గస్తీ పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చెడు నడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చెయ్యాలని సూచించారు. వారి కదలికలపై నిఘా పెట్టి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్కూల్, కళాశాల విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గంజాయితో కలిగే అనర్థాలు వివరించాలన్నారు. ఓటీపీ మోసాలు, ఇతర సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. ఎస్పీ వెంట మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘువేంద్ర, యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోండి

యర్రగొండపాలెం: దాడి చేసిన నిందితుడిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని పుల్లలచెరువు మండలం మానేపల్లి ఎస్సీ పాలేనికి చెందిన వారు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు విన్నవించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసేందుకు వచ్చిన ఎస్పీని వారు కలిశారు. కొండ అశోక్‌పై అగ్రకులానికి చెందిన వారు దాడి చేసి వారం రోజులవుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధితుడి తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.